


తుపాను బాధితులకు ప్రభుత్వం అండ : ప్రత్యేక అధికారి శ్యామల రావు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తిరుపతి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన శ్యామల రావు అన్నారు. మంగళవారం శ్రీ పద్మావతి అతిథి గృహంలో ప్రత్యేక అధికారిని కలెక్టర్ కె వెంకట రమణ రెడ్డి కలిసి జిల్లాలో తుఫాను నేపథ్యంలో తీసుకున్న పలు చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ముఖ్యమంత్రి సూచించిన మేరకు ప్రజలకు ఆపన్న హస్తం అందించాలని తెలిపారు. తాను పర్యటించిన గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, తిరుపతి రెవెన్యూ డివిజన్ల లో విద్యుత్, రహదారులు తదితరాల పునరుద్ధరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. జిల్లాలో తుఫాను ప్రభావిత డివిజన్లలోని 15 మండలాల పరిధిలో 17 గ్రామాల్లో 17 సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలను అందులో తరలించి 1293 మంది తూఫాన్ బాధితులకు ఆహారం, మంచినీరు, పాలు ఎప్పటికప్పుడు అందించామని కలెక్టర్ తెలిపారు. 17 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.



శ్రీకాళహస్తి - పిచ్చాటూరు రహదారిలో భారీ చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



గూడూరులో విద్యుత్ పునరుద్ధరణలో భాగంగా...



తిరుపతి శివారు ప్రాంతమైన కెబిఆర్ కాలనీ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలుని వెతుకుతున్న స్థానికులు

నష్టం...అపారం..!

'మిచౌంగ్' తుపాను తగ్గుముఖం

- మరో రెండు రోజులూ అప్రమత్తంగానే..
- నష్టం అంచనాల్లో అధికార యంత్రాంగం
- కెబిఆర్ నీటి ప్రవాహంలో బాలుని గల్లంతు
- వాహన రాకపోకలు పునరుద్ధరణ
- విద్యుత్ అంతరాయంపై చర్యలు
- సహాయ చర్యల్లో రాజకీయ పార్టీలు

'మిచౌంగ్' ప్రభావం తగ్గుముఖం పట్టింది.. మంగళవారం ఉదయం నుంచి కాస్త తెరపిచ్చింది.. దీంతో అధికార యంత్రాంగం నష్టం అంచనాల్లో తలమునకలయ్యింది. వర్షం తగ్గడంతో యువత వాగులు వంకలు వద్ద చేపలు పట్టేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలోనే తిరుపతి శివారు ప్రాంతమైన కెబిఆర్ వద్ద నీటి ప్రవాహంలో బాలుడు గల్లంతయ్యాడు. రెండు రోజులుగా భారీ వృక్షాలు రోడ్లకు అడ్డంగా పడడంతో చాలా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ అధికారులు కరెంట్ పునరుద్ధరించే పనిలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. పలుచోట్ల గొర్రెలు, పశువులు, కోళ్లు మృత్యువాతపడ్డాయి. పలు రాజకీయ పార్టీలు లోతట్టు ప్రాంతాల ప్రజలను పర్యటించి భోజన ప్యాకెట్లు అందించే ప్రయత్నం చేశారు. గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ పార్లమెంట్ సమావేశాల్లో తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ అతలాకుతలం అయ్యిందని, 5వేల కోట్ల రూపాయలను కేంద్రం సాయం చేయాలని కోరారు. పర్యాటక ప్రాంతాల వద్దకు యువత వచ్చినా అనుమతించకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట జాతీయ రహదారి వాహన రాకపోకలు లేకపోవడంతో నిర్మానుష్యంగా కనిపించింది. వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మరో రెండు రోజులు ఇలానే ఉంటే వరి పైరు ఏమాత్రం ఉపయోగపడదు.

విద్యుత్ సంస్థకు రూ. 13 కోట్ల నష్టం

ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష రావు

ప్రజాశక్తి –తిరుపతి సిటీ

తుఫాను కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని ఆయా ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నామని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు తెలిపారు. నెల్లూరు జిల్లాలోనే వుంటూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను మంగళవారం పరిశీలిస్తూ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ పనుల కోసం కర్నూలు, అనంతపురం, కడప సర్కిళ్ళ నుంచి 360 మంది విద్యుత్ శాఖ అధికారులు/సిబ్బందితో కూడిన ప్రత్యేక బందాలు నెల్లూరు సర్కిల్కు చేరుకున్నాయని వివరించారు. భారీ వర్షాల కారణంగా సంస్థ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని 6 పట్టణాలకు, 1119 గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. సంస్థకు సుమారు రూ.13 కోట్ల నష్టం వాటిల్లిందని



పేర్కొన్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడిన సర్వీసుల్లో మంగళవారం సాయంత్రానికి 1.81 లక్షల విద్యుత్ సర్వీసులు, 5425 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించామన్నారు. మిగిలిన సర్వీసులకు బుధవారం సాయంత్రానికి సరఫరా పునరుద్ధరణ పనులను పూర్తి చేస్తామని వివరించారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు/ సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800425155333 కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ కేబీఆర్ నగర్ వద్ద ఉధతంగా ప్రవహిస్తున్న వర్షపు నీటిలో మంగళవారం తిరుపతి జీవకోన ప్రాంతానికి చెందిన ఆనంద్, చిట్టి దంపతుల చిన్న కుమారుడు నిఖిల్ వర్మ కొట్టుకొని పోయాడు. వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో స్థానికంగా ఉండే యువత చేపలు పట్టడానికి పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతానికి వచ్చారు. ఇదే గ్రామంలో జీవకోన నుండి నిఖిల్ వర్మ కుటుంబ సభ్యులతో కలిసి కేబీఆర్ నగర్ వద్ద ప్రవహిస్తున్న కాలువ వద్దకు చేరుకున్నారు. ప్రమాదవశాత్తు ఎవరో నీటిలో కొట్టుకుని పోతున్నారని గమనించిన సమీప



నిఖిల్ వర్మ (ఫైల్‌ఫొటో)

చాపల వేటగాళ్లు కేకలు వేయడంతో నిఖిల్ వర్మ కనబడక పోవడంతో ఆ బాలుడే కొట్టుకుని పోయినట్టుగా కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో బాలుడు జాడను స్థానికులు, పోలీసులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు.

సురక్షితంగా ఇద్దరు యువకులు

ఏర్పేడు :ఏర్పేడు మండలం బండారుపల్లి వద్ద వాగులో ఇద్దరు యువకులు చిక్కుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల ఇన్చార్జి గున్నేరు కిషోర్ రెడ్డి చొరవతో ఏర్పేడు సీఐ శ్రీహరి, శ్రీకాళహస్తి ఫైర్ బందం వ్యవసాయ శాఖ బందం కషిచేసి యువకులను బయటకు చేర్చారు.

8,500 ఎకరాల్లో నీటి మునిగిన పంట

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాను కారణంగా శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం మండలాల పరిధిలో మంగళవారం సాయంత్రం వరకు 8,500 ఎకరాలకు పైగా నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డి తెలిపారు. వర్షం పూర్తిగా ఆగిన తరువాత పంట నష్టం ఎంత జరిగిందో నిర్ధారిస్తామన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి పంట నష్ట అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తొట్టంబేడు మండల పరిధిలో ఈ సీజనులో వరిపంట 4,470 ఎకరాలు, మినుము55 ఎకరాలు, మిరప 2.50 ఎకరాలలో సాగు చేశారని...ఇందులో సుమారు 3,200 ఎకరాలలో వరిపంట నీట మునిగిందని మండల వ్యవసాయశాఖ అధికారి సురేంద్రరెడ్డి తెలిపారు.

162 హెక్టార్లలో వరి పంట మునక : ఎడి


వెంకటగిరి : మండలంలోని వల్లివేడు, జికెపల్లి, చిన్నన్నపేట, ఉప్పరపల్లి గ్రామాల్లో నీట మునిగిన పొలాలను ఎడి ఎం.నాగార్జున్ తెలిపారు. 486 హెక్టార్లలో వరి నాట్లు వేశారని, తుపాను కారణంగా 162 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయన్నారు. మరో రెండు రోజులు వర్షాలు కొనసాగితే పంట నష్టం జరిగే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పి.సుజాత ఉన్నారు. మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. తన కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు.ముంపు ప్రాంత ప్రజలకు పాఠశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంకటేశ్వర పురం ఎస్టీ కాలనీలో వైసిపి స్టేట్ యూత్ సెక్రటరీ ముప్పాళ్ల సుబ్రమణ్యం, తహశీల్దార్ పద్మావతిచేతుల మీదుగా 60 మందికి నిత్యావసర వస్తువులను అందజేశారు. కౌవల్య ముంపు బాధితులకు డాక్టర్ కళాధర్ ఆహార పొట్లాలను అందించారు. ఇందిరమ్మకాలనీ బొగ్గులమిట్ట ఇళ్లలో మోకాళ్లలోతు నీళ్లు చేరాయి.



శ్రీకాళహస్తిలో పంట నష్టం అంచనా వేస్తూ..

కేంద్రం రూ.5వేల కోట్లు ఇవ్వాలి : ఎంపి గల్లా జయదేవ్

ప్రజాశక్తి - రేణిగుంట



ఆంధ్రప్రదేశ్‌లో మిచౌంగ్ తుఫాన్ వలన జరిగిన నష్టానికి కేంద్ర ప్రభుత్వం 5000 కోట్లను వెంటనే మంజూరు చేయాలని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కోరారు. మంగళవారం పార్లమెంటులో ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను ఆంధ్రప్రదేశ్లో బీభత్సం సష్టించిందన్నారు. తుఫాను ప్రభావంపై కేంద్ర బందాన్ని పంపి మధ్యంతర ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్రం దష్టికి తీసుకుచ్చారు. ఈ తుపాను రైతులకు కన్నీళ్లు తెప్పించి కోతకు సిద్ధంగా ఉన్న పంట కళ్ల ముందే పోయిందన్నారు. భారీ వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు.



అపాచీ కార్మికుల అగచాట్లు

తడ : తుపాను ప్రభావంతో శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద వాహనాలను పోలీసులు ఆపేయడంతో అపాచీ కార్మికులు అగచాట్లు పడ్డారు. సోమవారం కంపెనీలో పనిచేసిన కార్మికులను వాహనాల్లో ఇళ్లకు చేర్చలేక పోవడంతో రాత్రంతా ఫ్యాక్టరీలోనే ఉండిపోయిన కార్మికులు మంగళవారం ఉదయం రోడ్లపై నడుచుకుంటూ తమ ఇళ్లకు చేరుకున్నారు.

శల్య వైద్యశాలకు రాకపోకలు కట్



పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని రాచపాలెంలో ఈసలాపురంలోని శల్య వైద్యశాలకు రాకపోకలు కట్ అయ్యాయి. రైల్వే అండర్ బ్రిడ్జి డ్యాంను తలపించేలా ఉంది. దీంతో సోమవారం రాత్రి నుంచి స్థానికులకు, ప్రయాణికులకు, పేషంట్లకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ అధికారులు మోటార్ల సాయంతో నీళ్లు తోడినా ఫలితం లేకపోయింది.వడమాలపేట మండలంలో ఎస్‌బిఆర్ పురం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రమాదస్థాయికి చేరుకున్న కలుజు పారుతున్న చెరువును ప్రజా నాయకుడు నందయ్య, సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు పరిశీలించారు.

కూలిన పూరిగుడిసెలు

యర్రావారిపాలెం : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన చెరువులన్నీ నిండాయి. తలకోన అటవీ ప్రాంతం నుంచి వరద నీరు ముంచెత్తడంతో పూర్తిస్థాయిలు వాగులు వంకలు నింగి పొంగి పొర్లుతున్నాయి. చింతగుంట, వుస్తికాయలపెంట పంచాయతీల్లో వేరుశనగ, వరి, టమోటా, మొక్కజొన్న పూర్తిస్థాయిలో పంట దెబ్బతింది. ఉదయమాణిక్యం పంచాయతీ ఎరుకులపల్లి, కోటకాడపల్లి పంచాయతీ వలసపల్లి గిరిజన ప్రాంతాల్లో పూరి గుడిసెలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గొర్రెలు మృత్యువాత పడ్డాయి.



ఎస్టీ కాలనీలో మెడికల్ క్యాంపు

ఏర్పేడు : కోబాక గ్రామ పంచాయతీలోని ఎరుకలు మిట్ట ఎస్టీ కాలనీలో తుపాను ప్రభావితం అయిన ఎస్టీ కాలనీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. సిహెచ్ఒ కృష్ణవేణి, ఎఎన్ఎం కామాక్షి, సర్పంచి బుజ్జమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

గూడూరు రూరల్ : తుపాను ప్రభావంతో గూడూరు, పరిసర గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపోయి అంధకారం అలముకుంది. సోమవారం సిబ్బంది చెట్లను తొలగించి, వైర్లను సరిజేసే పనిలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. ప్రశాంతినగర్, ఇందిరానగర్, పోటుపాలెం, చవటపాలెం, దీవిపాలెం, చెన్నూరు, నెల్లటూరు మండలాల్లోని ప్రజలు రెండు రోజులుగా కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోకి భారీగా వరద నీరు చేరింది.

అక్కుర్తిలో 144 కోళ్లు మృతి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్



మండలంలోని అక్కుర్తి పంచాయతీలో వెంకటముని అనే రైతు కోళ్ల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. తుఫాన్ ప్రభావంతో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 144 కోళ్లు ఒక్కసారిగా మృత్యువాతకు గురికావడంతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఈ విషయం మీద తొండమనాడు పశువైద్యాధికారి రవీంద్ర వర్మను వివరణ కోరగా వెంకటముని అనే రైతు కోళ్లు చనిపోయిన విషయం వాస్తవమే అని తెలిపారు. అలాగే అతనికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించడానికి పై అధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. అలాగే తుఫాన్ కారణంగా మండలంలో ఉన్న ఆవులకు, ఎనుములకు, గొర్రెలకు, మేకలకు ప్రభుత్వం తరపున 346 టన్నుల సమీకృత దాణా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

బాపన చెరువుకు గండి

శ్రీకాళహస్తి రూరల్ : తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలో ఉన్న చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వేడం పంచాయతీలో సుమారు 132 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాపన చెరువుకు మంగళవారం ఉదయం గండి పడడంతో చెరువులోని నీరంతా చుట్టూ ఉన్న పంట పొలాల్లోకి ప్రవేశించడంతో నాట్లు నాటిన రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే వేడం ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ చెట్లు నేలకొరగడంతో శ్రీకాళహస్తి పట్టణానికి వేడం పంచాయతీకి రాకపోకలకు పూర్తిస్థాయిలో ఆటంకం ఏర్పడింది.



గూడూరు రహదారిపై మోకాలిలోతు నీళ్లలో ఆర్టీసీ బస్సు ఫీట్లు

సహాయ చర్యల్లో అన్ని రాజకీయ పార్టీలు



ఉప్పంగి హరిజనవాడలో పర్యటించిన సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు కాలనీలు తిరుపతిలో నీట మునిగాయి. ఉప్పంగి హరిజనవాడ, గొల్లవానిగుంట, ఆటోనగర్, కరకంబాడి రోడ్డు, వెంకట్‌రెడ్డి కాలనీల్లో సిపిఎం బృందం పర్యటించింది. సమస్యలను గుర్తించి మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. 70 ఇళ్లల్లోకి వర్షపునీరు చేరడంతో రాత్రులు నిద్రలేకుండా గడిపారు. డ్రైనేజీనీరు తాగేనీళ్లలో కలుషితమై తాగడానికి నీరు లేకుండా ఇబ్బంది పడుతున్నారు. సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు కె.వేణు, పి.బుజ్జి ఉన్నారు.

వలస కార్మికులను ఆదుకోవాలి

అసంఘటితరంగంలో పనిచేస్తున్న వలస కార్మికులను ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్‌చేశారు. నాలుగు రోజులుగా పనుల్లేక, తినడానికి తిండిలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పది కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. బిటిఆర్ కాలనీలో ఒరిస్సా ప్రాంతంనుంచి వలసొచ్చి దాదాపు 200 మంది పైచిలుకు కార్మికులు పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు.

టిడిపి, జనసేన నేతల పర్యటన

సత్యనారాయణపురం, ఉప్పంగి హరిజనవాడ ప్రాంతాల్లో టిడిపి, జనసేన నేతలు మంగళవారం పర్యటించారు. స్థానిక ప్రజలు ఎటువంటి సహాయ చర్యలు అందడం లేదని తెలిపారు. నిత్యావసరాలు అందించాలని,యుద్ధప్రాతిపదికన రోడ్లపై నిలిచిన నీటిని,చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, నాయకులు నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో... సిపిఎం నాయకులు శివకవి ముకుంద, పుట్టయ్య, చంద్రకళ ఆధ్వర్యంలో స్వర్ణముఖి నది పక్కన నివసిస్తున్న 15 కుటుంబాల వారిని పరామర్శించారు. నది కట్ట ఏర్పాటు మధ్యలో నిలిపివేయడంతో ప్రవాహం ఇళ్లల్లోకి నీరుచేరిందని, త్వరలో ఆ కట్టను పూర్తి చేయాలని కోరారు. కమిషనర్‌కు ఫోన్ ద్వారా తెలియజేసి భోజనాలు ఏర్పాటు చేశారు. కరెంట్ లేని కారణంగా మినరల్ వాటర్ అమ్మకాలు జోరందుకున్నాయి. వాటర్‌క్యాన్ నీళ్లు 20 రూపాయల నుంచి 30కి పెంచేశారన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం : టిటిడి ఛైర్మన్



తిరుపతి టౌన్ : నగరంలో వర్షం వల్ల ఎలాంటి ఇబ్బందులు రాకుండా గత అనుభవాల దృష్ట్యా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. నగరంలో కమిషనర్ హరిత, అర్బన్ ఎంఆర్ఒ వెంకటరమణలతోకలిసి వరద ప్రాంతాల్లో పర్యటించారు. వరద కాల్వల్లో పూడిక తీయడం, కాల్వలను ఆధునీకరించడం, కొత్త కాల్వలు నిర్మించడం చేశామని, దీనివల్ల లోతట్టు ప్రాంతాలు మినహా వరద నీటి ఉధృతుని అరికట్టామన్నారు. పూలవానిగుంట, గొల్లవానిగుంట ప్రాంతాల్లోని వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమాఅజయ్, ఎస్.ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్ఎ 'బియ్యపు' పర్యటన

రేణిగుంట : మంగళవారం మండలంలోని కుర్రకాల్వ గ్రామంలో ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కూలిపనులు లేక ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నం ప్యాకెట్లను అందజేశారు. ఏ సమస్య ఉన్నా డైరెక్టుగా తనకు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాసులు, వేణు, ప్రకాష్ పాల్గొన్నారు.

అన్నాసంపల్లి, అల్లిమిట్ట కాలనీల్లోని గిరిజనులకు టిడిపి వెంకటాపురం పంచాయతీ అధ్యక్షులు నాదమునిరెడ్డి ఆహార ప్యాకెట్లను అందజేశారు. ప్రధాన మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో 40 గిరిజన కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు.



చెరువుల శాశ్వత మరమ్మతులకు...

రూ.70 కోట్లు కావాలని ఇరిగేషన్ శాఖ అంచనా

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మిచౌంగ్' తుఫాను కారణంగా తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజవర్గాలకు చెందిన 11మండలాల్లో 112 చెరువులు దెబ్బతిన్నాయి. ఈ చెరువులకు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.కోటి అవసరం ఉంటుందని శ్రీకాళహస్తి నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి మంగళవారం నివేదికలు పంపారు. అదేవిధంగా ఈ చెరువులకు శాశ్వత మరమ్మతులు చేయడానికి రూ.70కోట్లు అవసరం ఉంటుందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేశారు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి శ్రీకాళహస్తి నీటిపారుదలశాఖ పరిధిలోని 905 చెరువులూ పొంగి పొర్లుతున్నాయి. చెరువులు పొంగిపొర్లుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో కురిసిన భారీ వర్షాలకు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో చాలా చెరువులు దెబ్బతిన్నాయి. అప్పట్లో నీటిపారుదల శాఖ అధికారులు కొంతమంది కాంట్రాక్టర్లను బతిమలాడుకుని ఆ చెరువులకు మరమ్మతులు చేయించారు. అయితే ఈ పనులు చేయించిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయలేదు. శాశ్వత మరమ్మతులకూ నిధులు ఇవ్వలేదు. ఇపుడు మళ్లీ 112 చెరువులు మరమ్మతులకు గురికావడంతో ఏం చేయాలోనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ తీరుతో చెరువులకు మరమ్మతులు చేయడానికి కూడా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. ఏదో ఒక రకంగా పనులు చేసినా ప్రభుత్వం బిల్లులు ఇవ్వదని కాంట్రాక్టర్లు భయపడుతున్నారు.

16 నుంచి పశ్చిమగోదావరిలో శ్రీనివాస కల్యాణాలు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా టీటీడీ శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల16 నుండి19వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు జరగనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

- 16న పాలకొల్లు మండల కేంద్రంలోని పెనుమాడం రోడ్డులో ఆర్‌ఆర్ రైస్ మిల్ మైదానంలో శ్రీనివాస కల్యాణం జరుగనుంది.
- 17న యలమంచిలి మండలం కట్టుపాళెం గ్రామంలోని శ్రీ కోదం డరామాలయం పక్కన ఖాళీ స్థలంలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారు.
- 18న తణుకు మండలం దువ్వ గ్రామంలోని శశి సెకండరీ పాఠశాల మైదానంలో స్వామివారి కల్యాణం జరుగనుంది.
- 19న తాడేపల్లిగూడెం మండలంలోని పడాల మార్కెట్ యార్డులో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారు.

నేడు ఎస్వీయూలో ధర్మనిధి ఉపన్యాసం

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలో ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ ఓ ప్రకటన తెలిపారు. బుధవారం 10.30గంటలకు సెనేట్ హాల్లో కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. "ఆధునిక సాహిత్య విమర్శ –దృక్పథాలు" అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి.అరుణకుమారి ప్రసంగిస్తారని ప్రకటనలో తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలదే ముఖ్య పాత్ర

- జాతీయ సదుస్సులో వైస్ ఛాన్సలర్ డి.భారతి



ప్రజాశక్తి-క్యాంపస్: అన్ని రంగాల్లో మహిళలే ముఖ్య పాత్ర పోషిస్తున్నారని వైస్ ఛాన్సలర్ డి.భారతి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో "సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ డి.భారతి పాల్గొని ప్రసంగించారు. ఎస్పీఎంవీవీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొ.ఎ.శ్రీదేవి సెమినార్ నివేదికను సమర్పించారు. మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రామమూర్తి పరిశోధనలో సుస్థిరత ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఎస్పీ ఎంవీవీ రిజిస్ట్రార్ ఎన్.రజనీ తన ప్రసంగంలో మహిళల జీవితంలో ఎదురయ్యే అవరోధాలు, వాటిని అధిగమించి వృత్తిపరమైన జీవితంలో ఎలా రాణించాలో వివరించారు. ఐఎస్‌సిఎ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం. భూపతినాయుడు సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళల ఆవశ్యకతను తెలిపారు. డా.చెంద్రాయుడు గ్రీన్ టెక్నాలజీ గురించి, సుస్థిర భవిష్యత్‌లో గ్రీన్ టెక్నాలజీ పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పి.జోస్నా, డాక్టర్ కె.పూర్ణచంద్రరావు, ఆర్.జయ మాధురి, బి.కిశోరి, డాక్టర్ జి.శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.సాయి దిలీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద బుధవారం 10వ ఏపి, ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్–జూనియర్ (14),9వ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ (17) బాయ్స్ అండ్ గర్ల్స్ ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికలు నిర్వహణ జరుగుతుందన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఐడి కార్డు కలిగి ఉండాలన్నారు. జిరాక్స్ కాపీతో పాటుగా ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ కాపీ, వారి వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్మెంట్‌తో హాజరు కావాలన్నారు. అండర్–14 విభాగానికి 2010 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు, క్యాడెట్ విభాగానికి అండర్ 17 01.01.2007 నుండి 30.11.2010 మధ్యలో పుట్టినవారు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9100640712, 9573144231 సంప్రదించాలన్నారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా సయ్యద్



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా షేక్ సయ్యద్ సాహెబ్ నియామకం హర్షనీయమని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఆయన్ని కలిసిన ప్రవీణ్, దుశ్శాలవతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సయ్యద్ సాహెబ్ ఉమ్మడి చిత్తూరుజిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడిగా, తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిపాలనాధికారిగా అనేక సంవత్సరాల నుండి ఉత్తమ సేవలు అందించారని, క్రీడల అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారని తెలిపారు. అటువంటి అధికారిని తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అధికారిగా నియమించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి జిఎస్ సాయికుమార్ ఘనంగా దుశ్శాలువలతో సత్కరించి పూల గుచ్ఛాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా శాప్ శిక్షకులు ఆదినారాయణ, హిందూజా, సాయి సుమతి, నీలిమ, విజయమోహన్‌రెడ్డి, సూర్య, కళ పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా సిద్ధం చేయండి

- అధికారులకు కమిషనర్ ఆదేశం



ప్రజాశక్తి-తిరుపతిటౌన్: పెండింగ్ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేయాలని తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కచ్చాపి ఆడిటోరియంలో తిరుపతి నియోజకవర్గంలోని బీఎల్‌వోలు, సూపర్ వైజర్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫారం 6, 7, 8 క్లెయిమ్స్ పూర్తిగా పరిశీలించి కార్యాలయంలో అందించాలన్నారు. ఓటరు వివరాలు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పరిశీలించి అందజేయాలన్నారు. మృతి చెందిన ఓట్లు తొలగించడంలో జాగ్రత్తలు వహించాలన్నారు. సంబంధిత ఆదారాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు వెంకటరమణ, చంద్రమౌళీశ్వరరెడ్డి, కెఎల్ వర్మ, సేతుమాధవ్, జీవన్, చిట్టిబాబు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో.. అన్ని వర్గాలకు మేలు

- పుత్తూరు టీడీపీ అధ్యక్షులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: తెలుగుదేశం పార్టీ ప్రక టించిన సూపర్‌సిక్స్ పథకాల మిని మ్యానిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు జీవరత్నంనాయుడు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 77వ బూత్‌లో "బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, గోపిఆచ్చారి, కన్నన్, ప్రభాకర్ రెడ్డి, ధనశేఖర్‌ఆచ్చారి, ప్రసాద్, నాగేష్‌బాబు, మురళిరెడ్డి, ప్రకాష్, ఆనందా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాంచన పుత్తూరు పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు కన్నయ్యనాయుడు, మునెయ్య, పుల్లయ్య, వీరరాఘవులు, గోవర్ధన్, గిరి, రమేష్ పాల్గొన్నారు.

'శ్రీచైత్ర'లో నాణ్యమైన, అత్యాధునిక వైద్యం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: యురాలజీ, గైనకాలజీ విభాగాలతో పాటు అనేక విభాగాలకు చెందిన సమస్యలకు 'శ్రీచైత్ర' ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతుల్లో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి అధినేతలు, ప్రముఖ కిడ్నీ, మూత్రకోశ వ్యాధి వైద్య నిపుణులు డాక్టరు టి.శ్యామ్ సుందర్, ప్రసూతి, గర్భకోశ వ్యాధి వైద్య నిపుణులు డాక్టరు ఎం.లక్ష్మీప్రసన్న తెలిపారు. స్థానిక దేవేంద్ర థియేటర్ సమీపంలోని అశోక్‌నగర్, రాయలసీమ పబ్లిక్ స్కూల్ లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీచైత్ర ఆసుపత్రి ప్రాంగాణంలో వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తిరుపతి నగర వాసులకు కార్పొరేట్ వైద్యానికి ధీటుగా సామాన్య ప్రజలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కల్గిన నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే తిరుపతితో పాటు మదనపల్లి, చిత్తూరు, పలమనేరు, రాయచోటి, రాజంపేట వంటి ప్రాంతాల్లోని ప్రజలకు మూత్రకోశవ్యాధుల, కిడ్నీ సంబంధిత వ్యాధులకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ, వారి మన్నలను పొందామన్నారు. వైద్యరంగంలోని విశేష అనుభవంతో అత్యాధునిక వైద్యాన్ని తిరుపతి వాసులకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో శ్రీచైత్ర ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. కిడ్నీ బ్లాడర్‌లో రాళ్ళు, మూత్రనాళములో రాళ్ళు, మూత్రదార సన్నగా రావడం, ప్రొస్టేట్ గ్రంధి వాపు, సెక్స్ సంబంధిత సమస్యలు, మగవారిలో సంతానలేమి సమస్యలు, మూత్రములో రక్తము, చీము కారడం, సుద్దపోవటం, చిన్నపిల్లల్లో కిడ్నీవాపు, మూత్ర సమస్యలు, స్త్రీలలో మూత్రము జారిపోవడం వంటి వ్యాధులు, స్త్రీలకు ప్రత్యేకంగా సాధారణ కాన్పులు, క్లిష్టమైన కాన్పులు, సిజజేరియన్ ఆపరేషన్లు, గర్భకోశ వ్యాదులు, మెనోపాస్ సమస్యలు, సంతానము లేని వారికి చికిత్స, గర్భకోశ క్యాన్సర్ స్క్రీనింగ్, రుతుస్రవ సమస్యలు, అండాశయంలో నీటి బుడగలు వంటి సమస్యలతో పాటు అనేక వైద్య విభాగాలకు చెందిన సమస్యలకు వైద్యం అందిస్తున్నామన్నారు. మా ఆసుపత్రిలో తిరుపతినగరంలోనే మొట్టమొదటి సారిగా అత్యాధునిక 'ధూలియం లేజర్' యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. శ్రీచైత్ర ఆసుపత్రుల్లో ఆర్ఐఆర్ఎస్ పద్దతి ద్వారా కోత, కుట్లు లేకుండా కిడ్నీలో రాళ్ల సమస్యలకు చికిత్స అందిస్తున్నామన్నారు. ఇటీవల 180 కేజీల బరువు ఉన్న ఓ వ్యక్తి ఆర్ఐఆర్ఎస్ పద్దతి ద్వారా చికిత్స అందించామన్నారు. సాధారణంగా అధిక బరువు ఉన్న వారికి ఇలాంటి చికిత్స అందిచేందుకు ఇబ్బంది ఉంటుందని కనుక చికిత్స అందించేందుకు ఆలోచిస్తారన్నారు. కానీ తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా, రోగిలో దైర్యాన్ని నింపి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించామని తెలిపారు. అలాగే 5 సంవత్సరాల వయస్సున్న చిన్నారికి మూత్రనాళం కింద బాగం బాగా ఉబ్బి ఉండడంతో యారుట్రోనిల్ అనే వ్యాధికి విజయవంతంగా చికిత్స అందించామని, ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్యవంతంగా ఉందన్నారు. ఇలా అనేక క్లిష్టమైన సమస్యలకు మా ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యాన్ని, అన్ని రంగాల ప్రజలకు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. శ్రీచైత్ర ఆసుపత్రిలో డాక్టరు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు ద్వారా, ఎంప్లాయిస్ హెల్త్‌స్కీమ్ ద్వారా, ప్రయివేట్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కలదని, అన్ని రకాల కోత కుట్లు లేని, ల్యాపరోస్కోపి ఆపరేషన్లు అందించడం మా ప్రత్యేకత అని తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు వారి సహాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7995167476, 7382174047 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు...

- యురాలజీ
- గైనకాలజీ
- జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్
- ఆర్థోపెడిక్ ఎండ్రోక్రైనాలజీ
- నెఫ్రాలజీ
- అనస్థిషీయా క్రిటికల్ కేర్
- ప్లాస్టిక్ సర్జరీ
- ఈఎన్‌టి, ఫల్మనాలజీ వైద్యసేవలు
- 24 గంటలు ఐసియు, అత్యావసర సేవలు
- ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ సౌకర్యం
- 24 గంటలు ఫార్మశీ సౌకర్యం





నాశిరకంగా శ్రీవారి అన్నప్రసాదం : నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అనే సూక్తి టిటిడికి వర్తించదా అని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుమల అన్నప్రసాదం నాశిరకంగా వడ్డించడం ఏంటని మండిపడ్డారు. సోషల్‌మీడియాలో అన్నప్రసాదం నాశిరకంగా ఉందని ప్రచారం జరగడంతో పై విధంగా స్పందించారు. రోం నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయిస్తున్నట్లు తిరుమల తరిగొండ వెంగమాంబ కాంప్లెక్స్‌లో అన్నప్రసాదం తినడానికి వీల్లేకుండా చాలా దారుణంగా ఉందని భక్తులు సిబ్బందిని నిలదీస్తున్నారని, సంబంధిత శాఖ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. నాణ్యత లేని బియ్యం వల్లే అన్నప్రసాదం నాశిరకంగా ఉంటోందన్నారు. టిటిడి ఈవో జవహర్‌రెడ్డి బదిలీ అయ్యి పదేళ్లయినా రెగ్యులర్ ఈవోను నియమించకపోవడంపై ప్రశ్నిస్తున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నారు.

పొరబాట్లుంటే సరిదిద్దుకుంటాం : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల అన్నప్రసాదం అత్యున్నత ప్రమాణాలతో అందిస్తున్నామని, ఏమైనా పొరబాట్లుంటే సరిదిద్దుకుంటామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉడకని అన్నం పెట్టారంటూ భక్తులు తినకనే వెనుదిరగడంతో టిటిడి ఛైర్మన్ వివరణ ఇచ్చారు. దేశవ్యాప్తంగా భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్న ఆలయాల్లో టిటిడి ప్రథమస్థానంలో నిలుస్తోందన్నారు. కేవలం 15 మంది మాత్రమే మిగిలిన భక్తులను రెచ్చగొట్టేలా మాట్లాడటం అనుమానాలు కలిగిస్తోందన్నారు. స్వామివారి దగ్గర ప్రతి ఒక్కరూ సంయమనంతో ఉండాలన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' బ్రోచర్ ఆవిష్కరణ



తిరుపతి టౌన్ : 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్ర వ్యాప్త క్రీడా కార్యక్రమానికి ఉద్దేశించిన బ్రోచర్, మస్కట్, ట్రోఫీలను టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆవిష్కరించారు. పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 15 వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివద్ధి అధికారి షేక్ సయ్యద్ సాహెబ్, కోచ్ లు గోపీ, వినోద్, హిందుజా, యహజాజ్ పాల్గొన్నారు.

నేల, నీరు జీవవైవిధ్యానికి ఎంతో అవసరం

- ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్
- ఘనంగా ప్రపంచ మృత్తికా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-క్యాంపస్: జీవవైవిధ్యానికి నేల, నీరు ఎంతో అవసరం అని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ ప్రపంచ మృత్తికా దినోత్సవ థీమ్ "సాయిల్ అండ్ వాటర్ : ఎ సోర్స్ ఆఫ్ లైఫ్" అని తెలిపి నేల, నీరు జీవవైవిధ్యానికి,పంటలకు ఎంతో అవసరమైనవని, నేల ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన పంటలను తద్వారా ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన పంట ఉత్పత్తులను పొందగలమని సూచించారు. నేల ఆరోగ్యాన్ని, నీటిని సంరక్షించుకోవాలని తెలిపారు. మృత్తికా విభాగపు ఇంచార్జ్ హెడ్ డాక్టర్ జి.పి.లీలావతి మాట్లాడుతూ సుస్థిర నేల యాజమాన్యం వలన నేలసారం, ఆరోగ్యం, వ్యవసాయానికి నీటి లభ్యత పెరుగుతుందని, వాతావరణంలో జరిగే మార్పులను తగ్గించవచ్చని తెలిపారు. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగపు హెడ్ డాక్టర్ ఎం.వి.రమణ మాట్లాడుతూ నేల పరిరక్షణ వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. కీటక విభాగపు హెడ్ డాక్టర్ కె.మంజుల సేంద్రీయ వ్యవసాయం వలన నేల సారవంతాన్ని, రైతు నేస్తాలైన వానపాముల సంఖ్యను మెరుగుపంచవచ్చు అని వివరించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల అసోసియేట్ డీన్ బహుమతులను ప్రదానం చేశారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్లు



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

మొక్కలు నాటి.. ఆవశ్యకత చాటి చెప్పి

ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఎస్వీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి.ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల సహకారంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేల, నీరే జీవరాశి అంతటికీ జీవనాధారం' అని, మానవాళికి అత్యధిక ఆహారాన్ని అందిస్తున్న నేలను పరిరక్షించుకోవాలని, నీటిని పొదుపుగా వాడి నీటి సంరక్షణా యాజమాన్య పద్ధతుల ద్వారా భావితరాలకు నీటిని అందించాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.ప్రియ వర్ధన్‌బాబు, వై.గంగాధర్ రావు, కె.కృష్ణకిశోర్, పి.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరి పుత్రులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

తొట్టంబేడు : జాతీయ వినియోగ దారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి మంగళవారం 60 కుటుంబాల గిరిజనుల ఆకలి తీర్చి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తొట్టంబేడు మండలం బోనుపల్లె పంచాయతీలోని కొండ కింద గిరిజనకాలనీ వాసులు ఈ తుఫాను దెబ్బకు విలవిల్లాడారు. మూడు రోజుల పాటు ఈ కాలనీ వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ కార్యక్రమంలో నితీష్, నాగయ్య, రమేష్, వీరాస్వామి పాల్గొన్నారు.

రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అరణియార్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీరు తగ్గుముఖం పట్టడంతో పిచ్చాటూరు – శ్రీకాళహస్తి మధ్య రాకపోకలను పునరుద్ధరించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణవనం మండలం పాలమంగళం హరిజనవాడలోకి వరదనీరు ప్రవహించి ఇళ్లల్లో నీరు చేరింది. 135 ఇళ్లల్లోకి నీరు వచ్చాయి. సమాచారం అందుకున్న ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో మాట్లాడి సమస్యను వివరించి హైవేను పగలగొట్టి నీటిని బయటకు పంపేలా చేశారు. అరణియార్ ప్రాజెక్టును పుత్తూరు డిఎస్‌పి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అరణియార్ ప్రాజెక్టు నుంచి దిగువకు 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

గిరిజనులకు పునరావాసం కల్పించాలి

బిఎన్ కండ్రిగ : కాటూరు పంచాయతీలోని ఓటివాని గిరిజనులకు వెంటనే పునరావాసం కల్పించాలని తెలుగుదేశం మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు డిమాండ్ చేశారు. దాదాపు 1500 కుటుంబాలు ఉంటున్నాయని, తక్షణం వారికి నిత్యావసర సరుకులు అందించాలన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ నాయకులు కత్తి రవి డిమాండ్ చేశారు.

నీటిప్రవాహం తగ్గగానే పరిష్కారం -మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మిచౌంగ్ తుఫాన్ కారణంగా వర్షపు నీటి ప్రవాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కేబీఆర్ నగర్ వాసులను మంగళవారం చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శించారు. స్థానిక వైఎస్‌ఆర్సిపి బాధ్యులు శివశంకర్ రాజుతో కలసి కేబీఆర్ నగర్ లో పర్యటించారు. నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టగానే పరిష్కార మార్గంకు అవసరమైన నిధులను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి పులివర్తి నాని సైతం సందర్శించారు. నీటి ప్రవాహంలోనే ఇళ్లల్లో ఉన్న వారికి బియ్యం, కూరగాయలు, సరుకులు అందజేశారు. మంగళం రామాలయం గుడి ప్రహరీ గోడ కూలి ఆటో దెబ్బతింది. తక్షణ సాయం అందించాలని ఇన్సూయరెన్స్ కంపెనీ వారికి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ మరమ్మతులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తుపాను ప్రభావంతో భారీ గాలి వర్షం కారణంగా చంద్రగిరి సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ స్థంబాలు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ కేబుల్స్ దెబ్బతినడంతో విద్యుత్ శాఖ ఈఈ వాసురెడ్డి ఆదేశాలతో ఎఇ నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. మంగళవారం చంద్రగిరి సబ్ స్టేషన్ పరిధిలోని శానంబట్ల, రంగంపేట, చంద్రగిరి పట్టణం, పిచ్చినాయుడుపల్లి, పనపాకం బొప్పరాజుపల్లి పంచాయతీలలో దెబ్బతిన్నట్లు తెలిపారు.

శేషాద్రి నగర్‌లోనూ ఓట్లున్నాయ్.. పాలకా.!

- పారిశుధ్యం నిర్వహణ లేక కాలనీలో అవస్థలు
- శుభ్రం చేయించమని కోరితే దాటేస్తున్న అధికారులు
- తమ పరిధి కాదంటున్న కార్పొరేషన్, పాడిపేట పంచాయతీ అధికారులు
- ఓటు కోసం వస్తే నిలదీస్తాం అంటున్న స్థానికులు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం శేషాద్రి నగర్‌లో సమస్యలు కాలనీ వాసులను వెంటాడుతున్నాయి. నివాస సముదాయంలో పారిశుద్ధ్యం లోపించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. చెత్త తొలగించక.. మురుగునీరు పారక సమస్యలు పడుతున్నామని వాపోయారు. దోమలు ప్రబలి విషజ్వరాలు వస్తున్నాయని, మురునీరు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 2500కుటుంబాలు కాలనీలో నివసిస్తున్నారు. పారిశుద్ధ్యం నిర్వహించాలని కార్పొరేషన్ అధికారులను స్థానికులు సంప్రదించగా తమ పరిధి కాదని, అక్కడి పంచాయతీలో సంప్రదించాలని తెగేసి చెబుతున్నట్లు మండిపడ్డారు. పంచాయతీ అధికారులను సంప్రదిస్తే కార్పొరేషన్ అధికారులను సంప్రదించాలని జారుకుంటున్నట్లు స్థానిక కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న స్థానికుల గోడు పట్టించుకోని అధికారుల తీరు పట్ల కాలనీ ప్రజలు మండిపడుతున్నారు. తమ ఓట్లు ఎవరి పరిధిలోకి వస్తాయో వారినే నిలదీయాలంటూ వాపోయారు. ఎన్నికల సమయంలో వస్తే నేతలను నిలదీసి తీరుతాం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టాటా మోటార్స్ కొత్త వాహనాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: దేశంలో అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ సరికొత్త ఇంట్రా వి70 పికప్, ఇంట్రా వి20 గోల్డ్ పీకప్, ఎస్ హెచ్‌టి ప్లస్ వాహనాలను ఆవిష్కరించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ గిరీష్ వాఫ్ తెలిపారు. కొత్త వాహనాల ఆవిష్కరణ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త వాహనాలు మెరుగైన ఆదాలతో ఎక్కువ దూరాలను, ఎక్కువ పేలోడ్‌లను మోసుకెళ్లాలా రూపొందించామన్నారు. అత్యుత్తమ క్లాస్ ఫీచర్‌లను అందించడంతో పాటు వివిధ రకాల వినియోగాల కోసం రూపొందించబడ్డాయన్నారు. ఇంట్రా వి70 హాయ్యెస్ట్ రేటెడ్ పేలోడ్ 1700 కిలోలు, 220 ఎన్ఎం టార్క్‌తో 1.5లీటర్ల డీజల్ ఇంజన్‌తో శక్తివంతమైనదిగా, 2960 మిల్లీమీటర్ల పొడవైన లోడ్‌బాడీతో రూపొదించామన్నారు. దీని క్యాబిన్ కారులాంటి సౌకర్యాన్ని, అలసట లేని డ్రైవింగ్ అనుభూతిని అందించేలా రూపొందించామన్నారు. ఇంట్రా వి20 గోల్డ్ 800 కెఎంల గరిష్ట రేంజ్, 1200 కిలోల హాయ్యెస్ట్ రేటెడ్ పేలోడ్ సామర్థ్యం, 2690మిల్లీమీటర్ల పొడవుతో క్లాస్ లీడింగ్ లోడ్ బాడీతో రూపొందింది. టాటా ఎస్ హెచ్‌టి ప్లస్ 800 సిసి డీజల్ ఇంజన్, అతి పొడవైన డెక్, 900 కిలోల హై పేలోడ్ సామర్థ్యంతో రూపొదించిందబడిందని తెలిపారు. వీటిని దేశ వ్యాప్తంగా అన్ని డీలర్ల వద్ద అందుబాటులో ఉంచామని, ఆశక్తిగల వారు వెంటనే ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. నాణ్యతకు, మన్నికకు మరోపేరుగా టాటా మోటర్స్ నిలుస్తుందని తెలిపారు. ఈ అవకావాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

